కథ :

గిట్టురాయి

డి. మురళీధర్

మద్రాసు నుండి ఢిల్లీ వెళ్ళే జి.టి. ఎక్స్‌ప్రెస్ రైలుకు టికెట్టు బెల్లయ్యింది. అంతదాకా స్తబ్దంగా ఉన్న స్టేషన్ సందడితో నిండిపోయింది. స్టేషన్‌ముందు సిటీ బస్సులు ఆగి వున్నాయి. ప్రయాణీకుల కోసం ఆటోలు పోటీపడి స్టేషన్‌కేసి వస్తున్నాయి. ఉదయం ఏడు గంటలు. బొగ్గుపొగల మధ్య సూర్యుడు పోలీసుల మధ్య ఖైదీలా చిక్కుపడిపోయాడు.

"చీకేవాలా - చీకేవాలా - మీఠావాలా" పండ్లవాళ్ళ కేకలు. పల్లీలమ్మేవాడు, పూలమ్మేవాడు అందరి ముఖాలు పరిశీలిస్తూ జనం మధ్య తిరుగుతున్నారు. దారికి రెండు ప్రక్కలా పొగచూరిన మురికి హోటల్లల్లో నుండి తెలుగు, హిందీ కలివిడిగా సినిమా పాటలు. మంగలిషాపు పక్క బేలాలో వేలాడదీసిన వార్తాపత్రికలు. మధ్యలో పత్రికలమ్మే పిల్లవాడి కీచుగొంతు కేక.

నల్లమల అడవులు దాటి, గూడాలు దాటి, పుల్లల చెరువు దాటి, ఎర్రగొండ
పాలెం దాటి, ఎర్రబడ్డ బాటలు దాటి,
నగరాలకు రాదా సారాబందని ఎన్ని ఎదురుచూపులు చూశావ్ ?
నిరాశకు కొట్టుకుపోకు
నువ్వో నిప్పుల వంతెనగా పుద్యమించు.
నీ మగని మత్తు పారిపోతుంది.
నీ కలత దిబ్బ కరిగిపోతుంది.
బార్లుగా, దుకాణాలుగా
పొంచి పొంచి తొలుస్తున్న షావుకార్ల పాలన
సారా ట్యూబులాగే పేలిపోతుంది.
నీకూ, నీభర్తకూ నీలాంటి వారికందరికీ చేతికందని శ్రమ
నిండు జాబిల్లిగా చేరువవుతుంది.
నీ వునికి యీ దేశ భాషకు కంఠహారమవుతుంది చెల్లీ!

ఈ రణగొణ ధ్వనుల మధ్య రాజశేఖర్ లూనా బండిని నడిపించలేకపోయాడు. అతనికి అన్నీ భయమే - అన్నీ శంకలే - అతని వెనక కూర్చున్న అతని తమ్ముడు తిరుపతి అన్నకు పూర్తి వ్యతిరేక స్వభావం.

"బాగో....బాగో...." మంగలి షాపుముందు పేపరు చదివే యువకులను పోలీసులు తరిమారు. పోలీసులు జనాన్ని కసురుకుంటూ, బూట్లు కిర్ కిర్ మంటుండగా హడావిడిగా తిరుగుతున్నారు.

"అబ్బ! ఎక్కడ చూసినా పోలీసులే. నాకు ఇక్కడికొస్తే హిట్లర్ రెండవ ప్రపంచ యుద్ధం కనిపిస్తున్నదన్నా!" తిరుపతి.

"నువ్వు నోరు మూసుకోరా! ఇది మీ 'చాందా'కాదు". రాజశేఖర్ లూనా ఆపి.

"ఏ పూరై తేంది-ఇట్లనే ఉంటే 'అన్న'కు ఖించుకట్టినట్టే"

"ఎక్కడ ఎవన్ని ఎవడు చంపాడో? మన చుట్టు ప్రతి పలుగురికి ఒకడు 'ఐడీ' పార్టీ వాడున్నాడు తెల్సా" రాజశేఖర్ తమ్మునికేసి వంగి గుసగుసగా-

"ఉంటే ఉండనియ్యే? మాట్లాడుడే బందుపెట్టరా?" తిరుపతి విసుక్కున్నాడు.

"తొందరగా టికెట్లు తెచ్చుకపో....నేను లూనా స్టాండుల పెట్టివస్త" రాజశేఖర్ ఆ ప్రస్తావన తప్పించే ఉద్దేశంతో....

తిరుపతి మందిలో కలిసిపోయాడు.

"నమస్తే మామ" రాజశేఖర్‌కు కుడిచేయి వైపునగల గోడవైపు నుండి పిలుపు విన్పించింది.

రాజశేఖర్ పోలీసుల మూడ్‌లో ఉన్నాడు కనుక ఉలిక్కిపడ్డాడు. బిత్తరపోయి అటుకేసి చూశాడు.

"ఇటు మామ.... నేను శివరాములును" సన్నగా పీలగా గడకర్రలాగా అంతెత్తు గల వ్యక్తి పండ్ల బండి అవతలనుంచి అన్నాడు.

రాజశేఖర్‌కు పసుపు పచ్చగా పండి ఉన్న రెండు అరటిగెలల మధ్య నల్లగా శివరాములు ముఖం కన్పించింది....శివరాములు రాజశేఖర్ ఊరివాడే. పైగా ఒకే కులం కనుక ఏదో వరుస.

"ఇదీ ఒకందుకు మంచిదే. స్కూటర్ స్టాండులో లూనా పెడితే వాడికి అవన సరంగారూపాయి యివ్వాలే". రాజశేఖర్ మనసులో అనుకొని లూనాను నెట్టుతూ శివరాములు పండ్ల బండిదాకా నడిచాడు.

"ఏండిర శివయ్య ఇక్కడ తేలినవ్ - పోనీ ఇంటికన్నా రావచ్చుగదా! ఊళ్ళో సంగతులేంది? మా వోళ్ళంత మంచిగున్నరు గదా!" రాజశేఖర్ లానాకు స్టాండు వేస్తూ........

"సిన్న మామకు, నీకు ఉద్యోగాలు దొరికి ఈవలబడితిరి. మీకు ఎరుక లేనిదే మున్నది? చేతికి మూతికి అందని బతుకేనాయె. ఊళ్ళెఅళ్ళ సొమ్ము దోసకపోయినట్టు తన్నులు గుద్దులు – ఇయ్యేడు నోట్లెకచ్చిన వంట గొడ్లమేపిచ్చిండ్లు – ఊళ్ళె కొట్లాంపు బెట్టిండ్లు – ఏదో కొన్ని దినాలు యీడికి కొట్టుకొచ్చిన". శివరాములు పండ్లు టకాటకా ప్యాకు చేస్తూనే చెప్పుకపోతున్నాడు. అతని వాలకం చూస్తే కడుపులో చాలా కష్టం దాచుకున్నవానిలాగే ఉన్నాడు.

"సరే సరే ఇప్పుడవన్ని వొద్దు – మళ్ళెప్పుడన్నా తీరిగ్గా మాట్లాడుకుందాం చూస్తున్నావ్ కదా! స్టేషనంతా మామలు నిండిపోయిండ్లు" రాజశేఖర్ అని "స్వంతమా పండ్ల బండి" అన్నాడు యథాలాపంగా.

"కాదు, ఈ పండ్ల సేట్ మా బావకు తెలుసు. భోజనంబెట్టి నెలకు నూటయాభై యిస్తానన్నాడు.... లాభం, నష్టం అతనివే"—శివరాములు.

"సరే సరే! నాకు క్రేను దగ్గర పనున్నది- ఈ బండి చూడు" రాజశేఖర్ జనంలో కలిసి స్టేషన్ కేసి నడిచాడు.

శివరాములు మాసిన బట్టలు, చెప్పుల్లేని కాళ్ళు, పీక్కుపోయిన దవడలు, రాజశేఖర్ మనస్సులో ఎక్కడో కలుక్కుమనిపించాయి.

తన బతుకు అట్లాగే ఉండేది, సరైన సమయంలో నిలదొక్కుకొని ఒక రేవుకు తేలాడు. లేకపోతే ఈ పాటికి ఎన్‌కౌంటరో, జైలో, లేకపోతే వనవాసమో తప్పేవికావు.... చదువుకొనే రోజులు, ఆ ఉత్సాహంలో, ఆ వయసులో ఏమీ తెలియవు- వొట్టి బొక్కలకు కొండ్రిగాడు దెబ్బలు తిన్నట్టు రానిదానికి పోనిదానికి బతుకు నాశనం.... తనప్పుడు ఆ నిర్ణయం తీసుకోవడం బాగైయింది' రాజశేఖర్ చేదు జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ స్టేషన్ చేరుకున్నాడు.

తిరుపతి ఎవరో ఒక స్త్రీ చేతికి డబ్బు యిచ్చి సునాయాసంగా టికెట్టు తెప్పించుకున్నాడు.

"రా అన్న- లేటయ్యింది" తిరుపతి.

"ప్లాట్‌ఫాం టికెట్టు తీసుకున్నావా?" రాజశేఖర్.

"నీకన్నీ భయాలే—" తిరుపతి.

రాజశేఖర్ అదేమి పట్టించుకోకుండా "మనూరి శివరాములు కల్సిండురా" అన్నాడు.

"ఎవలు సుద్దపెల్లి చంద్రయ్య బావకొడుకా?"

"ఔను వాడే మనలోటోల్లంత వెళ్ళి వచ్చిన తరువాత వాళ్ళే పాలిటిక్సు నడుపు తండ్లు- పాలిటిక్సుతో పాడైపోయి నెలకు నూటయాభైకి పండ్లు అమ్ముతున్నడు".

"మనమూ తిరిగిన వాళ్ళమే. నిలవడ్డోడు ఉరికెటోన్ని ఎక్కిరిచ్చిందంటం మనకు చాతకాదు. ఇంకొకలు ఆ పని చెయ్యొద్దు.... అది సరేగాని శివరాములు నిన్ను గుర్తు పట్టిండా?".

"గుర్తుపట్టక పోవడమేమిటారా ? డెబ్బైఎనిమిది సంవత్సరాల షావుకారి కింద గిర్విబడ్డ వాళ్ళ భూమిని నేనేకదా గెట్టుమీదుండి దున్నిచ్చింది. వాడు అయివారుగురిని వెంటేసుకొచ్చి నన్ను, చంద్రయ్యబావను, అప్పుడు పన్నెండేండ్లనుకుంట శివ రాములను ఇయ్యరమయ్య కొట్టలేదా ? ఆ తరువాత ఊరేగింపు గొడవ చూస్తే శివరాముని పుర్రెపగిలి నెత్తురు గలుసుకట్టింది.

అదేలొల్లిల సైకిలుమీద తాలూకాకు తీసుకపోయి కుట్లేయించి కట్టుకట్టించి మందులు కొనుక్కొని నడిజాము వరకు ఇంటికొచ్చిన".

"అప్పటి రోజులట్లాంటివి....ఇప్పుడో నీడను చూస్తే నీకు భయం ఎంతైనా ఎద్దుముడ్డి పొడుసుక బతికెటోల్లం—మనం ఈ లెవల్లో ఉన్నమంటే ఉద్యమమే కదా!" తిరుపతి అన్నాడు. తిరుపతి చందాలో ఒక కంపినీలో ఎలక్ట్రిషన్....

"ఆఁ మనస్వశక్తి...." రాజశేఖర్ పెదవులు చప్పరించాడు తిరుపతి ముఖంలో అన్నమీద కలిగిన ఈసడింపు భావం రాజశేఖర్ చూడలేదు. ధనధనలాడుతూ ట్రేనొచ్చింది. తిరుపతి మందిని తోసుకుంటూ వెళ్లి ఎదురుగ గల రిజర్వు కంపార్టు మెంటులోనికి ఎక్కాడు.

"మొత్తానికి వీడెక్కడైనా బతుకగలడు. తనకైతే రిజర్వు కంపార్టుమెంటును చూస్తేనే కాళ్లు వణుకుతాయి. అంతెందుకు ప్లాటుఫాం టికెట్టులేదని బయటే ఉండి పోయాడు. ఒకప్పటి చొరవ ఏమయిపోయింది. అప్పుడైతే"—రాజశేఖర్‌కు ఈ ఆలోచనలకే భయమయ్యింది.

ఒక్కసారి మేల్కొన్నవానిలాగా చూశాడు....ట్రేన్ దిగిన జనప్రవాహం

నానా రకాల మాటలతో చప్పుళ్లతో తోసుకొచ్చింది. స్టేషన్ ముందు ఆటోలవాళ్లు హారన్లు మోగిస్తూ సవారి గురించి అడుగుతున్నారు.

ఎర్రగా, ఎత్తుగా ఉన్నవాళ్లు, బూరెబుగ్గలవాళ్లు, జీవితంలో ఏ చీకు, చింత లేనట్లున్న వాళ్లే ఆ రైలునుండి ఎక్కువ మంది దిగారు....ఒకలు అరా పీక్కుపోయిన ముఖాలు గల వాళ్లున్నారు.

ఎప్పుడొచ్చి ఆగిందోగాని పోలీసుల జీపొచ్చి ఆగింది....జీబులోనుండి నల్లగా కుదిమట్టంగా ఉన్న సర్కిల్ దిగాడు. పోలీసులు హడావిడి పడిపోయి ఆటోలను దూరంగా తరిమారు.

ట్రేనులో నుండి దిగిన వాళ్లల్లో బూరెబుగ్గల వాళ్లనొదిలి పీక్కుపోయిన ముఖాల వాళ్లను అనుమానంగా చూస్తున్నారు. ఈ రైల్లోనే ఘరానా నేరస్తుడెవరో వస్తున్నట్లున్నాయి వాళ్ల చూపులు....

"ఏయ్ మిస్టర్"....సర్కిల్ ఇన్‌స్పెక్టరు ఎవరినో పిలిచాడు.

రాజశేఖర్ టక్కున ఆగిపోయాడు.

కాని సర్కిల్ పిలిచింది రాజశేఖర్ పక్కనున్నతన్ని....

ఒక పోలీసు పరుగెత్తుకొచ్చి రాజశేఖర్ పక్కతని చేతుల్లోని అట్టాడబ్బాను జబర్దస్తీగా తెరిచి "సార్ తెల్లకాయిదాలు" అన్నాడు.

"ఆ కాగితాలెక్కడివి ?" సర్కిల్

"కొనుక్కొస్తున్న సార్ ...." అతను

"ఎందుకు కరపత్రాలకా ?" సర్కిల్....

పోలీసులు ధన్‌మని అతని చెంపమీద ఒక దెబ్బ కొట్టాడు.

"అరె! నన్నెందుకు కొడుతండ్లు—నేను శ్రీ వెంకటేశ్వర ప్రెస్‌ల పనిచేస్త. మా సేఠ్ తెమ్మంటె తెస్తున్న" అతను లబోదిబోమన్నాడు.

సర్కిల్ అవమానంగా ఇంకో దిక్కు ముఖం తిప్పుకొని వెళ్లిపోయాడు.

"తెరిమాకా—ముందే చెప్పద్దుబే! పో—కనిపించకుండా పో" పోలీసు గద్దించాడు.

రాజశేఖర్‌కు ముచ్చెమటలు పోశాయి. గబగబ నడిచి శివరాములు పండ్ల బండి దగ్గరకు చేరుకున్నాడు.

"ఎందుకనో గావరగావర వస్తుండ్లు మామ" శివరాములు.

"ఏంలేదు స్టేషన్ ముందు పోలీసులు చెక్ చేస్తుండ్లు".

"చెయ్యనియ్యండ్లి, దొంగలుపడ్డ అర్నెల్లకు....మన దగ్గరేమున్నయి ?" శివరాములు చిన్నగా నవ్వుతూ....

"ఏం పిలగా అరటిపండ్లు ఎట్లమ్ముతున్నవ్ ?" నల్లగా జిడ్డోడుతూ వున్న ఒక బొగ్గుగని కార్మికుడు అడిగాడు. రాత్రి డ్యూటీనుండి వస్తున్నట్లున్నది. నెత్తిమీద బొక్క టోపీ....

"ఆ—చీచీవాలా—తింటె తియ్యగా—" శివరాములు బండి చుట్టు తిరిగి ఓ మురిగిపోయిన అరటిపండు తీసి పారేసి, మరొకటి జాలిగా అడిగిన ఒక పిల్లవాడి కిచ్చాడు.

"వినేస్నర—తమ్మీ—పండ్లమ్ముతవా ? దానధర్మాలు సేస్తవా ?"

"వస్తున్న—వస్తున్నసార్! జెర పోద్గాలనాయ్—దుకాణం సదురుకోవద్దా ? అటుచూడు పోలీసోల్లు, అచ్చెపోయెటోల్లు సదురుకుంటలేరా ? ఆఁ ఎన్నియ్యాలె—బయట నాలుగు రూపాయలకు డజను. నీకైతే మూడున్నర." శివరాములు డజను అరటిపండ్లు గెలనుండి కోశాడు.

"ఏంనాకే ఎందుకట్ల ? మా యిల్లు పక్క నీ యిల్లా ? ఏమన్నసుట్టానివా ?" కార్మికుడు తెల్లని పండ్లు బయటపడే లాగున నవ్వి సైకిలు దిగి పండ్ల బండి దగ్గర కొచ్చి—టోపి అంగూర పండ్ల దగ్గర పడేసిండు. శివరాములు చేతిలోని పండ్లు ఒకటొకటే వంకలు పెడుతూ అటిటు, ముడుతూ మాట్లాడాడు కార్మికుడు.

శివరాములు పండ్లు ప్యాకుచేసి "ఇక అందరు గిట్ల ఏరుకపోతేమేమెట్ల బతుకాలెనన్న—" పండ్లు బండికిందికి వంగి కాగితాలు తీసి జాగ్రత్తగా చుట్టాడు.

"అదేమి కట్టుడు, సైకిలుమీద పెట్టుకుంట మంచిగ ప్యాకుచేయి" కార్మికుడు మరో పేపరు వేసి కట్టాడు. కార్మికుడు వెనుక సీటుమీద పండ్లుపెట్టుకొని సైకి లెక్కాడు.

"టోపి మర్సిపోయినవన్న" శివరాములు టోపి తీసుకపోయి యిచ్చాడు. కార్మికుడిచ్చిన పైసలు తీసుకున్నాడు.

అటునుండి ముగ్గురు పోలీసులు పండ్ల దుకాణాలను "దూరం జరుపండ"ని హెచ్చరిస్తూ వెళ్లిపోయారు.

"గిరాకి పొద్దునగదా!" శివరాములు నొచ్చుకున్నాడు.

"పర్వలేదు" రాజశేఖర్ లూనా తీసుకుపోయాడు. సీటుమీద అంతా దుమ్ము

పేరుకపోయింది. శివరాములు పండ్ల బండికింద భాగంలో గల బారుగు డబ్బాలో గుడ్డపేగులు కనిపిస్తున్నాయి. రాజశేఖర్ ఒక గుడ్డపేగు తీసుకోబోయాడు.

"నేను దూడుస్త గద మామ" శివరాములు గుడ్డలేసి లూనా దులిపాడు. "అత్తా, పిల్లలు అంతా బాగానే కదా" శివరాములు.

"ఆఁ" అన్నాడు రాజశేఖర్ పొడిగా- తొందరగా అక్కడినుండి బయట పడాలని రాజశేఖరుకున్నది.

శివరాములుకేమొ ఇంకా 'లోతైనవి' చాలా విషయాలు అడుగాలని ఉన్నది. "ఎక్కడ బతుక వశమైత లేదు మామ. ఏడ చూసిన లఫంగలే ఎవరిని నమ్మకుంటొచ్చింది. చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకునేటోల్లు జమయ్యిండ్లు- మన బతుకు మనం ఏ అంటు సొంటు లేకుంట బతుకుదామన్న వశపడకుంటున్నది" శివరాములు జనాంతికంగా అని- ఓరగా రాజశేఖర్ ముఖంలోకి చూసి- "ఆఁ ఇగో ముసలవ్వ. గియ్యి రెండున్నరకు డజను- అంగూర రాత్రేదిగింది మాల్- కిలో అయిదు రూపాలు- అంగూరలేందిఁటం అవ్వ- డజను అరటిపండ్లిస్త కొంటబో" బండి ముందు నిలబడ్డున్న ముసలవ్వకు అరటి పండ్లు పొట్లం కట్టియిచ్చి పావుల తక్కువున్నయంటే "సర్ పో" అన్నాడు. అట్లాగే ఇంకో డజను అరటి పండ్లు ప్యాకు చేసి తెచ్చి రాజశేఖర్ లూనా పక్కన గల రేకు డబ్బాలో వేశాడు.

రాజశేఖర్‌కు ఒక సంగతి గుర్తొచ్చింది. తను ఉద్యోగంలో చేరిన కొత్తలో అప్పట్లో తన దగ్గరికి వచ్చే మనిషికోసం శివరాములు కొరియర్‌గా ఉత్తరం తెచ్చాడు. అవ్వన్నీ శివరాములుకు గుర్తున్నయా? గుర్తులేకుంటెనే మంచిది. "వద్దు శివరాములు.... పోనీ ఇగోడబ్బు" రాజశేఖర్ జేబులోనుండి అయిదు రూపాయల నోటు తీసి పట్టుకున్నాడు.

"వద్దు- డజను అరటిపండ్లే కదా! పిల్లలుతింటరు".

"నువ్వు నూటయాభై రూపాయలకు నెలంత కష్టపడాలె- ఈ డజను పండ్లకు ఈ రోజు జీతం టుప్పా"

శివరాములు రాజశేఖర్ కళ్ళల్లోకి చూశాడు.

"గానుగలది గంటెడే కది మామ- సేఠ్ చూడచ్చిండా ? లెక్కబెట్టి యిచ్చిండా?" శివరాములు.

740

రాజశేఖర్ అయిదు రూపాయలనోటు జేబులో వేసుకొని లూనా స్టార్టు చేసుకొని వెళ్ళిపోయాడు.

తను ఎప్పుడో చేసిన సహాయాన్ని శివరాములు ఇంకా మరిచిపోలేదు. కృతజ్ఞత చూపుతున్నాడు. పాపం శివరాములు లాంటి అమాయకులు ఎవరిని పడితే వాళ్ళనే నమ్ముతారు. అందరిని ఇట్లాగే నమ్మి మోసపోతున్నారు. నాడు తెలంగాణా పోరాటమప్పుడు నాయకత్వాన్ని నమ్మారు. ఆనాడు నాయకత్వం జనాన్ని తుపాకుల ముందుకు తోలి తోక ముడిచారు. మొన్న శ్రీకాకుళము అంతే కాలేదా? ఎవరినంటే ఏమున్నది? ప్రజలు మూర్ఖులు. ప్రతిదాన్ని నమ్మి వెంటబడి ఉరికి వాడు మోసం చేయగానే కూలబడతరు. శివరాములు పిచ్చోడు కాకపోతే మరేమిటి? తన నింకా సానుభూతిపరుడే అనుకుంటున్నాడు. మారె ఈ దేశంలో విప్లవం కల్ల....పాపం శివరాములు లాంటి వాళ్ళు ఎన్నడు బాగుపడుతరో ? — రాజశేఖర్ తన మనసులో అనుకున్నాడు.

అక్కడ శివరాములు ముఖం మబ్బు కప్పింది. కాసేపటికి పెదవులమీద చిరునవ్వు మెరిసింది. "ఇంకానయం. కింది డబ్బాలల్లో చెయ్యిపెట్టనియ్యలేదు. బొగ్గుబాయిల అన్నలిచ్చిన అరటిపండ్లకు చుట్టిన పత్రికలు, కరపత్రాలు గుర్తుపట్టిండా ? టోపిలోనుండి ఉత్తరం తీయడం చూశాడా? మారె అంత తెలివితేటలు లేనట్లున్నది. ఉద్యోగంలో- అదీ చెముటెల్లని ఉద్యోగంలో చేరితే అంతేనమకుంట. తను- తన కుటుంబం- స్వార్థం పెరుగలేదనుకుంట. తను సేఠ్ కండ్లు గప్పి పండ్లు యిస్తున్నానంటే నడీ లేదు నప్పుడులేదు అయిదు రూపాయలు జేబులో పెట్టుకపోయిండు. అన్నలు "దొంగతనాన్ని" వద్దంటరు. అన్నిటికన్న ముఖ్యంగా ఎవరైనా ఎట్ల విచారం చేస్తండ్లు అన్నది చూస్తరు. తన పరీక్ష పనికొచ్చింది. మామ మనోడు గాదు మందోడే-" శివరాములు అంచనా కట్టాడు.

శివరాములు 'వ్యాపారం' సాగుతూనే ఉన్నది. మరేదో రైలు రాబోతోంది. జన ప్రవాహం పెరిగిపోతూనే ఉన్నది. పోలీసులు వచ్చేవాళ్ళను పోయేవాళ్ళను అనుమానంగా చూస్తూనే ఉన్నారు.

o o o

741